సీఎం సభా స్థలిని పరిశీలించిన కలెక్టర్



మేడ్చల్: ఈ నెల 9వ తేదీన కండ్లకోయలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న సందర్భంగా సభా స్థలిని జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులు, పోలీసులు, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కండ్లకోయ ఐటీ పార్క్ ప్రతిపాదిత స్థలంలో సభ నిర్వాహణకు కావాల్సిన వసతులు, చేయాల్సిన పనులు, పార్కింగ్ స్థలం, వేదిక ఏర్పాటు రాకపోకలకు రూట్లు, భద్రత ఏర్పాట్లు వంటివి పరిశీలించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్ తదితరులు ఉన్నారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కీసరగుట్ట జాతరకు 300 ఆర్టీసీ బస్సులు



కీసరగుట్టలో ఆర్టీసీ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

కీసర: కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మార్చి 7 నుంచి మార్చి 11వ తేదీ వరకు సికింద్రాబాద్ అమ్ముగూడ, వెంకటాపూర్, ఉప్పల్, ఘట్‌కేసర్ నుంచి భక్తుల సౌకర్యార్థం సుమారు 300 వరకు ఆర్టీసీ బస్సులను కీసరగుట్టకు నడుపుతున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు అన్నారు. కీసరగుట్ట బహ్మోత్సవాల సందర్భంగా బుధవారం కీసరగుట్ట బస్టాండ్‌లో కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కీసరగుట్ట జాతర క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖాన్, డిప్యూటీ ఆర్.ఎం.ఓ జిహెచ్‌జెడ్ శ్రీనివాస, డిప్యూటీ ఆర్ఎంఒ సికింద్రాబాద్ భీమ్‌రెడ్డి, డిపో మేనేజర్లు శ్రీనివాస్, కవిత, రామ్మోహన్, భవభూతి, చంద్రకాంత్, సూపర్‌వైజర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఈటలకు రిటైర్డ్ ఆర్మీ అధికారుల మద్దతు



ఈటల రాజేందర్‌తో రిటైర్డ్ అధికారులు

మేడ్చల్‌రూరల్: మాజీ మంత్రి, బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను బుధవారం అఖిల భారతీయ పూర్వ సైనిక్ సేవా పరిషత్ సంఘం రాష్ట్ర నాయకులు కలిశారు. మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఆయనను కలిసిన రిటైర్డ్ అధికారులు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మద్దతు తెలిపారు. కల్నల్ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, దేశ భద్రత, సరిహద్దులో సైనికులకు వసతులు ప్రధాని మోదీ ప్రభుత్వంలో చాలా మెరుగయ్యాయని, అందుకే తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ ఉద్యమకారుడు, మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్నందున మద్దతుగా ఉంటామన్నారు.

వైభవంగా వరాల మల్లన్న స్వామి కల్యాణం



పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బాలాజీనగర్‌లోని వరాల మల్లన్న దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మేయర్ మేకల కావ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ.. బాలాజీనగర్ మల్లన్న స్వామి ఆలయానికి గొప్ప విశిష్టత ఉందని, ప్రజలందరికీ స్వామి వారి ఆశీస్సులు ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌కుమార్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, స్థానిక నాయకులు మెట్టు వెంకన్న, బండకింది ప్రసాద్, అశోక్‌యాదవ్, నర్సింహాయాదవ్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు గడువు లోపల పరిష్కరించాలి



వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ విజయేంద్రరెడ్డి

ఘట్‌కేసర్: స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ధరణి దరఖాస్తులు గడువు లోపల పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేంద్రరెడ్డి అదనపు కలెక్టర్ విజయేంద్రరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సేవ కేంద్రాన్ని తనిఖీ చేసి దరఖాస్తుల పరిష్కార విధానాన్ని పర్యవేక్షించారు. ధరణి దరఖాస్తులు పరిష్కారానికి రికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. తహసీల్దార్ రజని, నాయబ్ తహసీల్దార్ సందీప్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐలు చారి, సాయిరాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్: మేడ్చల్ మండలంలో నిర్వహించే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ వసంతకుమారి తెలిపారు. మండలంలో ఈ సంవత్సరం పరీక్షల నిర్వహణకు 12 సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతనంగా పట్టణంలోని ఎస్ఎస్‌జీ స్కూల్‌లో, డబీల్‌పూర్‌లోని నాజరేన్ గ్రామర్ స్కూల్‌లో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని పరీక్షల నిర్వహణ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

సంపూర్ణ సుకన్య సమృద్ధి గ్రామంగా చీర్యాల

సాక్షి, సిటీబ్యూరో: ఆడపిల్లలకు ఆర్థిక భద్రత కల్పించే కేంద్ర ప్రభుత్వ సుకన్య సమృద్ధి యోజన పథకం కింద వంద శాతం ఖాతాలు తెరిచిన నగర శివారులోని చీర్యాల సంపూర్ణ సుకన్య సమృద్ధి గ్రామంగా ఎంపికైంది. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ డివిజన్ పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ ఏ.సుబ్రహ్మణ్యం ప్రకటించారు. చీర్యాలలో 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సుగల అర్హులైన ఆడపిల్లలందరికీ సుకన్య సమృద్ధి ఖాతాలను తెరిచారు. ఈ సందర్భంగా చీర్యాల గ్రామంలో సమావేశం నిర్వహించి ప్రకటించారు.

సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగితేనే రాణిస్తాం

- రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్
- బిట్స్ పిలానీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, తదితరులు

జవహర్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో రాచకొండ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలోని అత్యున్నత స్థానంలో మహిళలు రాణించడం అభినందనీయం అన్నారు. చదువుతోనే మహిళలకు సమానత్వం సిద్ధిస్తుందని, ప్రతి రంగంలో మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతూ సాగుతున్నారని, మహిళలను గౌరవించే దేశం భారతదేశం కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మహిళగా జన్మించడం అదృష్టమని, పురుషులు వారి జీవితంలో మహిళలు లేకుండా మనుగడ సాధించలేరని, మహిళల్లో సంకల్ప శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో తల్లి మొదటి గురువు అని, ఆమె ద్వారా ప్రపంచడానికి పరిచయం అవుతామన్నారు. సమాజంలో సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగితేనే రాణిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ అభిలాష బిస్త్ ఐపీఎస్, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి ఐపీఎస్, మల్కాజిగిరి డీసీపీ పద్మజ ఐపీఎస్, డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, మహేశ్వరం డీసీపీ సునీతరెడ్డి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, బాలీవుడ్ నటి తనాజ్ ఇరానీ, ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ వైస్ చైర్మన్ వెంకటేష్ సంగం, జనరల్ సెక్రటరీ సతీష్ వడ్లమాని, కోశాధికారి గగన్‌కోహ్లీ, చీఫ్ కో–ఆర్డినేటర్ సావిత్రి, మహిళా పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యాదిరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న హరివర్ధన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహేశ్‌గౌడ్ తదితరులు

ఘట్‌కేసర్: కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు, ఘట్‌కేసర్ మండలం ఘనాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి తండ్రి యాదిరెడ్డి దశదిన కర్మను ఘనాపూర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, కొమ్మూరి రాకేశ్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవిముదిరాజ్, రేవంత్‌రెడ్డి టీం సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి గోపాల్‌రెడ్డి నివాసంలో యాదిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుమారులు శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, కోడళ్లు మంజుల, స్వప్న, జ్యోతి, కూతుర్లు మహేశ్వరీ, లలిత, అండాలు, అల్లుల్లు రాఘవరెడ్డి, బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మమతగౌడ్, మాధవరెడ్డి, గోవర్ధన్‌గౌడ్, సత్తయ్యముదిరాజ్, రమేశ్, పరమేశ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, సురేశ్‌నాయక్ ఉన్నారు.

చేతి వృత్తిదారులకు వరం

- పీఎం విశ్వకర్మ పథకంతో పెరగ నున్న ఉపాధి అవకాశాలు
- మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం
- పథకం అమలుకు జిల్లా పరిశ్రమల శాఖ కసరత్తు











సాక్షి, మేడ్చల్ జిల్లా: ఒకప్పుడు చేతి వృత్తిదారులకు గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండేవి. మారుతున్న కాలానికి అనుగుణంగా హస్త కళాకారులు నూతన ఒరవడి అందిపుచ్చుకోవడంలో కొంత వెనుకపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు పలు రకాల యంత్ర పరికరాలు (టూల్ కిట్లు) పంపిణీ చేయడం, తక్కువ వడ్డీకి రుణాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా 2023 సెప్టెంబరు 17న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా అర్హులైన హస్త కళాకారుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి వారికి శిక్షణ అందించనున్నారు.

మూడు విభాగాలుగా...

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా ఎంపికైన వారికి వారం పాటు నిపుణులతో పలు హస్త కళారూపాలు తయారీపై శిక్షణను మూడు విభాగాలుగా అందిస్తారు. మొదటిది చేతి వృత్తి కళాకారుల నైపుణ్యాలను అంచనా వేయడం, రెండోది ప్రాథమిక శిక్షణ ద్వారా నైపుణ్యాలు మెరుగుపడేలా చూస్తారు. మూడోది అధునాతన శిక్షణ ద్వారా మరింత నైపుణ్యం పెంచుకునేందుకు 15 రోజుల వరకు అధునాతన శిక్షణ అందిస్తారు. కార్యక్రమానికి హాజరైన చేతి వృత్తి కళాకారులకు రోజుకు రూ.500 చొప్పున అందించనున్నారు. ప్రాథమిక శిక్షణ పూర్తయ్యాక లబ్ధిదారులకు అవసరమైన యంత్ర పరికరాలు(టూల్ కిట్లు)ల కొనుగోలుకు రూ.15 వేలు చెల్లించనున్నారు. అనంతరం బ్యాంకుల ద్వారా 5 శాతం వడ్డీతో రూ.లక్ష రుణం మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటారు. మొదటి విడత రుణాన్ని లబ్ధిదారులు 18 నెలల కాలంలో చెల్లిస్తే.. రెండో విడతలో రూ.2 లక్షల వరకు రుణం పొందవచ్చు. ఈ రుణం 30 నెలల కాలంలో చెల్లించాల్సి ఉంటుంది.

ఎవరికి వర్తిస్తుందంటే..

స్వయం ఉపాధి ప్రాతిపదికన సంప్రదాయ చేతి వృత్తిదారులు, హస్త కళాకారులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందడానికి అర్హులు.. వడ్రంగి, పడవలు, ఆయుధాలు తయారు చేసేవారు, కమ్మరి, సుత్తులు, టూల్ కిట్లు తయారు చేసేవారు. శిల్పులు, స్వర్ణకారులు, కుమ్మరి, చెప్పులు కుట్టేవారు, తాపీ మేస్త్రీలు, బుట్ట, చాపలు, చీపుర్లు అల్లేవారు. బొమ్మల తయారీ, నాయీ బ్రాహ్మణులు, పూలదండలు తయారు చేసేవారు, చాకలి, దర్జీలు, చేపల వలలు తయారు చేసేవారు. తాళంచెవి తయారీదారులకు పథకాన్ని వర్తింపజేయనున్నారు.

అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం..



ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా 18 ఏళ్లు నిండిన హస్త కళాకారులకు అవసరమైన శిక్షణ అందించి రుణ సదుపాయం కల్పించడమే ఈ పథకం ఉద్దేశం. పలు శాఖల సమన్వయంతో ఇటీవల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాం. పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– పి.రవీందర్, జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశ్రమల శాఖ

దరఖాస్తు విధానం..

అర్హులైన వారు వివరాలను వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. లబ్ధిదారుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలి. ఐదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి రుణాలు పొందకూడదు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు అనర్హులు. లబ్ధిదారులు సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ) కేంద్రాల ద్వారా ఎలాంటి రుసుం లేకుండా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్, ఫోన్ నంబర్, బ్యాంకు వివరాలు, రేషన్ కార్డును సమర్పించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న తర్వాత అర్హుల ఎంపిక బాధ్యతను గ్రామ పంచాయతీ కార్యదర్శులు చూడనున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సంబంధిత కార్యదర్శులకు పంపిస్తారు. వాటి ఆధారంగా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులు చేతి వృత్తులను చేస్తున్నారా..? లేదా అనే వివరాలను పరిశీలించి ఎంపిక చేస్తారు.

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి స్వామివారి ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కీసర: ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గుట్టకు వచ్చే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. కీసరగుట్టలో బ్రహ్మోత్సవాల మొదటి రోజు పూజల్లో బుధవారం పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కీసరగుట్ట దేవాలయానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న కీసరగుట్టకు బ్రహ్మోత్సవాల సందర్భంగా 4 నుంచి 5 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, ఇందుకోసం జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం రూ.కోటి నిధులను మంజూరు చేయడం సంతోషకరం అన్నారు. ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలతో భక్తులకు శుభం కలగాలని కోరుకున్నట్లు తెలిపారు. తాగునీరు, శానిటేషన్, శాంతి భద్రతలు, నిరంతర విద్యుత్, ఆర్టీసీ బస్సుల సౌకర్యం, క్యూలైన్లు, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన సౌకర్యం తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ నరేందర్, ట్రస్టు బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో వ్యవసాయ శాస్త్రవేత్తలు


రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ఎంసీపల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం, అధికారులు, రైతులు

శామీర్‌పేట్: రైతులకు మరింత చేరువగా వ్యవసాయ శాస్త్రవేత్తలు అందుబాటులో ఉంటారని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో భాగంగా ప్రతి అసెంబ్లీకి నియోజకవర్గానికి ఒక వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను అందజేశారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా మూడుచింతలపల్లి రైతు వేదిక నుంచి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో నేరుగా మాట్లాడవచ్చని, సాగుపై ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకోవచ్చని రైతులకు ఆయన సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు చేరాల్సిన సబ్సిడీలను ఎత్తివేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను సబ్సిడీలో రైతులకు అందజేస్తే బాగుంటుందని తన అభిప్రాయాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యవసాయశాఖకు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మేరీ రేఖ, ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి, మేడ్చల జిల్లాలోని ఏఓలు, ఏఈఓలు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు బసితా తస్నీన్



బసితా తస్నీన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్(ఎమ్మార్సీఈ) కళాశాల విద్యార్థిని జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికై ంది. బీటెక్ సీఈసీ చివరి సంవత్సరం విద్యార్థిని బసితా తస్నీన్ ఈ నెల 3న నగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అండర్–21 మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ నెల 8 నుంచి 12 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్రం నుంచి తస్నీన్ ప్రాతినిధ్యం వహించనుంది. ఈ మేరకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ టీవీ రెడ్డి, డైరెక్టర్ సుధీర్‌రెడ్డి, ఏఓ రాజేశ్, పీడీ మానస ఆమెను అభినందించారు.

ఓటుపై విద్యార్థులకు అవగాహన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడ మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మేరా పెహలా ఓట్– దేశ్ కే లియే కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఓటు విలువ, ఓటు హక్కు వినియోగం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు విధిగా ఓటు నమోదు చేసుకుని, ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకోకపోవడం రాజ్యాంగాన్ని కించపర్చడమే అన్నారు. విద్యార్థులు ప్రజలకు ఓటు విలువను వివరించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీవీ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రత్నకుమార్, ఏఓ రాజేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20 స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు చేసుకోండి

డీఎంహెచ్ఓ డాక్టరు రఘునాథ్


సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు పద్ధతిలో 20 మంది స్టాఫ్ నర్సుల ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘురాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులకు అవసరమైన సర్టిఫికెట్ల కాపీలను జతచేసి, రూ.200 (మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, జిల్లా వైద్య – ఆరోగ్య అధికారికి పేరుపై)డీడీ తీసి, ఈ నెల 7, 11, 12 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

అభివృద్ధికి మహిళా సాధికారత అవసరం



పోచారం: మహిళా సాధికారతతోనే నిజమైన మానవ అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ నాయకురాలు ఈటల జమున అన్నారు. అన్నోజిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శక్తి వందన్ కార్యక్రమంపై స్వయం సహాయక బృందాలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల సాధికారత కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చాతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూంకుంటలో తాజా హోటల్ ప్రారంభం



శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారికి పక్కన గల తాజా హోటల్‌ను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో రౌడీషీటర్లు యాదగిరియాదవ్, మధుగౌడ్, ఫయూమ్‌కు సీఐ సైదులు, ఎస్సై అశోక్‌తో కలిసి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అంతకు ముందు వారి జీవన విధానం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అల్లర్లలో పాల్గొనరాదని, ఎన్నికలు, పండగలు, ఇతర వేడుకల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, కదలికలపై పోలీసులు నిఘా ఉంటుందని హెచ్చరించారు.

ఫిర్ ఏక్ బార్.. మోదీ సర్కార్..



బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్

బీజేపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు

ఘట్‌కేసర్: దేశంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి భారత్‌కు ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ తేవాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో ఎదులాబాద్, ఘనాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్, టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బుధవారం ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల నివాసంలో వారికి కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల కార్యదర్శి చెన్నప్ప, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మురళీ, బాలు, జనార్దన్‌గౌడ్, నాగరాజ్, ప్రభాకర్, భాస్కర్, వికాస్, ధీరజ్ బీజేపీలో చేరగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, ప్రభంజన్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, బాలరాజ్‌గౌడ్, కుమారస్వామి, సాయికిరణ్, సత్యనారాయణ, రాజేశ్, అశోక్, యాదగిరి, చిరంజీవి, మల్లేశ్, భాస్కర్‌గౌడ్, రాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాయిప్రియ కాలనీలో శివరాత్రి వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: దమ్మాయిగూడ సాయిప్రియ కాలనీలోని ఓంకార క్షేత్రంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని గురువారం ఉదయం గురు వందనం, విఘ్నేశ్వర పూజ, హోమం, సాయంత్రం చండీహోమం, అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేయనున్నట్లు ఓంకార క్షేత్రం కన్వీనర్ తెలిపారు. శుక్రవారం మహా శివరాత్రి సందర్భంగా ఉదయం మహాన్యాస ఏకవార రుద్రాభిషేకం, సాయంత్రం శివపార్వతుల కల్యాణం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

భూకుంభకోణం ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న బద్దం నర్సింహారెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్–36లో భూకుంభకోణం జరిగిందని వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఘట్‌కేసర్ రైతు సహకార సంఘం వైస్ చైర్మన్ బద్దం అనంతరెడ్డి తనయుడు నర్సింహారెడ్డి అన్నారు. పోచారంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి అనంతరెడ్డికి 2003వ సంవత్సరంలో హక్కుదారులు చేసిన నోటరీ ఆధారంగా ప్రొసీడింగ్‌తో పాటు పట్టా పాస్ పుస్తకాలు తీసుకున్నామన్నారు. అనంతరం 2016వ సంవత్సరంలో తనకు, తన తల్లి కళావతి, అక్క వినోదలకు అనంతరెడ్డి గిఫ్ట్ డీడ్ ఇచ్చారన్నారు. ఈ ప్రక్రియ అంతా జరిగిన తర్వాతే ప్లాట్లు విక్రయించామన్నారు. పాస్ పుస్తకాలు, ప్రొసీడింగ్ కాపీలను నకిలీ సంతకాలు, రబ్బరు స్టాంపులతో సృష్టించినట్లు బద్దం నరేందర్‌రెడ్డి ఆరోపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. తాము అమ్మిన ప్లాట్లలో బోర్డులు పాతి, టెంట్లు వేసి కొనుగోలుదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తాతలు అమ్మిన ఆస్తిపై మనమలు వచ్చి పొంతనలేని వాదనతో తాము కూడా హక్కుదారులమని గొడవ చేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే బద్దం శ్రీకాంత్ రెడ్డి, బద్దం మల్లిఖార్జునరెడ్డి, బద్దం నిరూపరెడ్డి, బద్దం యశ్వంత్‌రెడ్డిలపై నెల రోజుల క్రితమే ఎఫ్ఐఆర్ నమోదైందని చెప్పారు. ఇదిలా ఉండగానే తమపై కోర్టు ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేయించారన్నారు. కేసు విచారిస్తున్న పోలీసులకు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్ కాపీలు అందజేయడం జరిగిందన్నారు.

గంజాయి విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థులు అరెస్టు

పోచారం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఘట్‌కేసర్ మండల పరిధిలో ఇంజినీరింగ్ కళాశాలలు ఎక్కువగా ఉండటంతో ఆ పరిసర ప్రాంతాల్లోనే రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మకాం పెట్టారు. వీరికి అన్నోజిగూడ చౌరస్తాలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులు చిక్కారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయిని ఆంధ్రప్రదేశ్‌లోని అరకు నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, 3.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు సుభాష్, బాలరాజ్ తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా శాలిపేట్‌కు చెందిన బోయిని నవనీత(34) 12 ఏళ్ల క్రితం మెదక్ జిల్లాలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్‌తో వివాహం జరిగింది. సాయికుమార్‌కు మేడ్చల్ బస్ డిపోలో ఆర్టీసీ కండాక్టర్ ఉద్యోగం రావడంతో సాయికుమార్ కుటుంబంతో కలిసి మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా సాయికుమార్ భార్య నవనీతో గొడవ పడుతూ విడాకులు ఇస్తానంటూ బెదిరింపులకు పాల్పడటంతో ఈ క్రమంలో గత మంగళవారం సాయంత్రం మరోమారు భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్థాపానికి గురైన బోయిన నవనీత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు, సోదరుడు మరణానికి కారణం భర్త, అతడి కుటుంబీకులే అంటూ మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.